

పిడుగు పడి కౌలు రైతు దుర్మరణం

ప్రజాశక్తి-కాజులూరు

భారీ వర్షానికి పిడుగు పడి మండలంలోని జగన్నాథగిరిలో కౌలు రైతు బుకే బాలకష్ణ (35) మృతి చెందారు. విఆర్‌ఒ ఈశ్వర సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన బాలకృష్ణ రామచంద్రపురం మండలం కాపవరంలో అత్తగారి ఇంటి దగ్గర ఉండి భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెనుమళ్ళ నుండి కాపవరం వెళ్తుండగా వర్షం రావడంతో జగన్నాథగిరి సమీపంలో పిడుగు పడటంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని ఆయన తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు.

పని ఎక్కువ.. వేతనాలు తక్కువ..

- సమస్యల్లో షాపింగ్ మాల్స్ కార్మికులు
- కార్మిక చట్టాల ప్రకారం అందని పథకాలు
- షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిలుపుదల

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న కార్మికుల వెతలు ఎవరికీ పట్టడం లేదు. పొట్టకూటి కోసం, కుటుంబాలను పోషించుకోవడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అరకొర వేతనాలతో ఈ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువ పని గంటలు, అధిక పని ఒత్తిడి, ప్రభుత్వ పథకాలకు నోచుకోకుండా, కార్మిక చట్టాలు సైతం అమలు కాని పరిస్థితుల్లో పని చేస్తున్నారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న మాల్స్ కార్మికుల సమస్యలు అన్నీ ఇన్నీ కావు.

కాకినాడ జిల్లా కేంద్రంతో బాటు తుని, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, ఇతర మండల కేంద్రాల్లో సిఎంఆర్, చందన, ఎస్ఆర్ఎంటి, సౌత్ ఇండియా, సూరత్, టిప్స్ టాప్స్, ట్రెండ్స్, రిలయన్స్ వస్త్ర దుకాణాలు, డి.మార్ట్, విజేత మాల్స్, వైభవ్, మల్‌బార్, జిఆర్‌టి, శ్రీరాజ్ జ్యుయలర్స్, జోయాలుకాస్, ఖజానా, శ్రీలలితా, బాబు పెరల్స్ బంగారు, వెండి ఆభరణాల వంటి భారీ షాపులతో పాటు సుమారు 500కుపైగా బంగారం షాపులు, 2 వేలకు పైగా చిన్న దుస్తుల దుకాణాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 15 వేల మంది కార్మికులు రోజు పని చేస్తుంటారు. అందులో 80 శాతం మంది మహిళలే పని చేస్తున్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

షాపింగ్ మాల్స్ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలి. గత ప్రభుత్వం నిలిపివేసిన షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ పథకాన్ని ఈ ప్రభుత్వం మళ్లీ ప్రారంభించాలి. పని లేని సమయంలో కూర్చోవడానికి షాపింగ్ మాల్ ఉద్యోగులకు స్టూల్స్ ఏర్పాటు చేయాలి.

- మలకా రమణ, సిఐటియు జిల్లా నాయకులు



ఒత్తిళ్ల నడుమ పనులు

షాపింగ్ మాల్స్‌లో నిత్యం పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. సుమారు 12 గంటల పాటు పని చేయాలి. లేకుంటే కుటుంబ పోషణ కష్టం. అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో నిరంతరం నిలుచునే పని చేయాలి. దీంతో ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గడిపే సమయం కూడా ఉండడం లేదు. ఎవరైనా ఉద్యోగులు ప్రశ్నిస్తే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. వారి నుంచి తీసుకున్న సర్టిఫికెట్స్ ఇచ్చేందుకు నానా ఇబ్బందులూ పెడుతున్నారు. రోజురోజుకు జిల్లాలో మాల్స్ పెరుగుతున్నాయి. వీటిలో పని చేయడానికి కార్మికులు కూడా వస్తున్నారు. వాస్తవానికి వీరికి అమలు అవుతున్న చట్టాలపై అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలి. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ద్వారా వచ్చే బెనిఫిట్స్ కార్మికులకు మళ్లీ అందే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మహిళా కార్మికుల వెతలు

మాల్స్‌లలో పని చేసేవారు 80 శాతానికి పైగా మహిళలే ఉంటున్నారు. మగవారి కంటే వీరికి వేతనాలు తక్కువగా ఇస్తుంటారు. పని గంటలు కూడా ఎక్కువగా పని చేస్తారనే కారణంతో మాల్స్ నిర్వాహకులు వీరినే నియమిస్తారు. ఇదే తరుణంలో మహిళా కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సరైన బాత్ రూమ్‌ల సౌకర్యం లేకపోవడంతో అనారోగ్య సమస్యలతో నిత్యం సతమతమవుతున్నా యాజమాన్యాలు కనీసంగా పట్టించుకోవు. కేరళలో అక్కడ ప్రభుత్వం షాపింగ్ మాల్స్‌లో పని చేసే మహిళల సమస్యలను గుర్తించి రైట్ టు సిట్టింగ్ హక్కును కల్పించింది. ప్రతి ఒక్కరూ కూర్చోని పని చేయాలని ఆదేశించింది. కానీ ఇక్కడ ఆ అవకాశం లేకపోవడంతో 12 గంటల పాటు నిల్చోని పని చేసుకోవాల్సిన పరిస్థితి.

అందని ప్రభుత్వ సౌకర్యాలు

కార్మిక చట్టాల ప్రకారం వీరికి ప్రభుత్వం ద్వారా అందించే సౌకర్యాలు అందడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కొన్ని పథకాలు అందేవి. వైసిపి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసింది. గతంలో కార్మికుల కుమార్తె వివాహ సందర్భంగా రూ.20 వేలు అందించేవారు. విద్యా ప్రోత్సాహంగా ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు రూ.5 వేలు, పాలిటెక్నిక్ రూ.10 వేలు, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బిఎస్‌సి, బి.ఫార్మసీ, బిసిఎ, ఎంసిఎ, బిబిఎ, ఎంబిఎ, డిహెచ్ఎంఎస్, చదువుతున్న వారికీ సహాయం అందేది. వికలాంగులైన కార్మికుల పిల్లలకు విద్యా ప్రోత్సాహకంగా ఏ తరగతి లేదా ఏ కోర్సు చదువుతున్నా సంవత్సరానికి ఒక్కసారి రూ.10 వేలు స్కాలర్‌షిప్ ఇచ్చేవారు. వైద్య సహాయకంగా దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సలకు ఆపరేషన్, చికిత్స నిమిత్తం రూ.50 వేలు, కార్మికుడు ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు, సహజ మరణ ఆర్థిక సాయం, కార్మికుడు సహజ మరణం చెందితే వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం క్రింద రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేసేవారు. అంత్యక్రియల ఖర్చులకు రూ.10 వేలు, ప్రమాదం కారణంగా శాశ్వత అంగవైకల్యం సంభవిస్తే రూ.2.50 లక్షలు, ప్రసూతి సాయంగా ప్రసవించిన మహిళా కార్మికురాలికి రూ.20 వేలు అందించేవారు. కానీ ప్రస్తుతం ఈ పథకాలేమీ అమలు కావడం లేదు. దీంతో కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

హైవే నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేసి నిర్ధేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ, సర్వే, విద్యుత్, పోలవరం, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి-216, కాకినాడ - కత్తిపూడి, కాకినాడ పోర్టు-అచ్చంపేట, అచ్చంపేట-సామర్లకోట, వాకలపూడి-అన్నవరం వరకూ నిర్మించనున్న జాతీయ రహదారులు, నిర్మాణ దశలో ఉన్న రహదారుల పనుల పురోగతి, ఇతర భూసేకరణ, టెండర్ల ప్రక్రియలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. జిల్లాలో చేపట్టిన వివిధ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టినందున రెవెన్యూ, ఎన్‌హెచ్ఎఐ ఇంజనీరింగ్ అధికారులు, సర్వే, విద్యుత్తు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ఎఐ పిడి డి.సురేంద్ర, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణపై అవగాహన



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-కాకినాడ

మే 22న జరగనున్న అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయం ప్రాంగణం (వివేకానంద పార్క్)లో గురువారం జిల్లాస్థాయి చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, ప్రదర్శన (ఎగ్జిబిషన్) కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 48 పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన 218 మంది విద్యార్థుల ఉత్సాహభరిత హాజరుతో ఈ కార్యక్రమం చైతన్యవంతంగా సాగింది. ప్రధాన అతిథిగా హాజరైన రాష్ట్ర జీవవైవిధ్య మండలి ప్రాంతీయ సమన్వయకర్త వి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జీవవైవిధ్యం భూమికి శ్వాస వంటిదన్నారు. ప్రతి జీవికీ భూమిపై హక్కు ఉందన్నారు. వాటి సంరక్షణ మన అందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. అటవీ శాఖ రేంజర్ ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ దాదాపు 10 వేల జీవజాతులు అంతరించి పోతున్నాయన్నారు. ఇది ఆందోళనకరమైన అంశం అన్నారు. మన ఉనికే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రంథాలయ పరిపాలనాధికారి ములంపాక శ్రీనివాసరావు, చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవి కుమార్, యంగ్ మైండ్స్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ, నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కెవికె.మహేశ్వరరావు, బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, కేసరి శ్రీనివాసరావు, చింతా నారాయణమూర్తి, చిన్నబాబు, జి.సావిత్రి ప్రసాద్ పాల్గొన్నారు.

9వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజినీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమ వేతనాలు పెంచడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.నాగేశ్వరరావు, భాస్కరరావు, స్వామి, సోనియా, పాపారావు, శివరామకృష్ణ, ప్రశాంత్, కె.రమణ, బి.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపిడిఒ కె.స్వప్న ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ శాఖల బ్యాంకు అధికారులు అభ్యర్థులు దరఖాస్తులు పరిశీలించారు. అభ్యర్థుల నుండి పథకం వివరాలు అడిగి తెలుసుకున్నారు.




ఫీజు చెక్కు అందజేస్తున్న సభ్యులు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-జగ్గంపేట

కాపవరం గ్రామానికి చెందిన కర్రి కీర్తిశైలజాదేవి పదో తరగతి పరీక్షల్లో 520 మార్కులు సాధించింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన ఆమెను తల్లి కష్టపడి చదివించింది. మణికర్ణిక టీమ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు గున్నాబత్తుల పూజా అనూష గౌరీ శంకర్, మధుసూధనరావు సాయంతో ఆమెను ఇంటర్మీడియట్ చదివించనున్నారు. వారి ద్వారా గురువారం అనపర్తి జిబిఆర్ జూనియర్ కాలేజ్‌లో చేర్చారు. కళాశాల ఫీజు రూ.10 వేల చెక్కును ప్రిన్సిపల్ రామలింగ స్వామికి అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక సభ్యులు మొగలంక శ్రీనివాస్, గున్నాబత్తుల వీరబాబు, టీమ్ సభ్యులు చిక్కాల మణికంఠ, పులిగ రమేష్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇఒపిఆర్‌డి ఇందిరాదేవి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ఇఒపిఆర్‌డి సిహెచ్.ఇందిరా దేవి(50) అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం మృతి చెందారు. ఆమె మతికి పలువురు సంతాపం తెలిపారు. గతేడాది డిసెంబర్ 24న ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఇటీవల డిప్యూటీ ఎంపిడిఒగా ప్రమోషన్ పొందారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతూ సెలవులో ఉన్నారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మరణం పట్ల ఎంపిపి రాయుడు సునీత, నాయకులు రాయుడు గంగాధర్, ఎంపిడిఒ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి విజెవి.రమణ, పంచాయితీ, సచివాలయ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది గురువారం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సామర్లకోట లోని ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కళ్ల జోళ్లు, దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ

రామారావు పేటలోని లయన్స్ క్లబ్ హాల్లో రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 85 మంది పేదలకు కళ్లజోళ్లు, దుస్తులను ట్రస్ట్ కార్యదర్శి ఎన్.కల్యాణి, ప్రసాద్ పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ మాట్లాడుతూ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. గురువారం సుమారు 85 మందికి కళ్లజోళ్లు, దుస్తులు పంపిణీ చేశామని బాదం చెప్పారు. ఇటువంటి సేవలకు దాతలు, ప్రజలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి డివిఆర్ జగన్నాథ రావు, సీమకుర్తి పాపారావు, చరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తూనికల్లో తేడా వస్తే చర్యలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తూనికల్లో తేడా వస్తే చర్యలు తప్పవని వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు భళ్ళమూడి నారాయణమూర్తి అన్నారు. మెట్రాలజీ వారోత్సవాలలో భాగంగా స్థానిక ధ్యాన మందిరంలో ఏలేశ్వరం మర్చంట్ అసోసియేషన్ గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వ్యాపారులు తుకాలు కొలతలలో పారదర్శకంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ మాట్లాడుతూ వేయింగ్ మిషన్లు ప్రతి ఏడాది రెన్యువల్ చేయించుకోవాలని, ప్యాకింగ్ ప్రోడక్ట్‌లో తేడా రాకుండా చూసుకోవాలని సూచించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్ పిలుపు ఇచ్చారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో దారపురెడ్డి క్రాంతి కుమార్ అధ్యక్షతన కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం అనేక సమస్యలతో సతమతం అవుతోందన్నారు. ఈ తరుణంలో కార్మికులను ఆదుకోవలసిన ప్రభుత్వాలు రకరకాల పేర్లతో మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు చింతల సత్యనారాయణ, దాడి బేబీ, గూనూరు వెంకటరమణ, వడ్డి సత్యనారాయణ, భూసారి శ్రీను స్నేహలత, కరక సుబ్బలక్ష్మి, సూరిబాబు, రమణ, భద్ర రావు, భూదేవి, శ్రీనివాస్, భాషా తదితరులు పాల్గొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలన్నీ కలిపి ఈనెల 20వ తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసి జూలై 9న సమ్మె నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు డి శేషాబాబ్జి తెలిపారు. పిఠాపురంలోని చెలికాని భావనరావు సభ సదన్‌లో కార్మిక సంఘాలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దుచేసి నూతన 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం వల్ల కార్మికులు సమాన పనికి సమాన వేతనం రాకుండా నష్టపోవడమే కాక, పని భద్రత ఉండదని, అదనపు పని గంటలు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి ఉన్న కార్మికుల్ని తీసివేసి కాంటాక్ట్ లేబర్ కింద తీసుకునే చర్యల్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. కె.చిన్న, విశ్వనాథం, విజయశాంత, నాగ పద్మ, వీరబాబు, రామకష్ణ, సుధారాణి కష్ణవేణి, పద్మావతి, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, కెవివి సత్యనారాయణ పాల్గొన్నారు.



పిఠాపురంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషబాబ్జి



పెద్దాపురంలో మాట్లాడుతున్న చెక్కల రాజ్‌కుమార్

విద్యార్థులకు అవగాహన

కోటనందూరు : స్థానిక ఎవిఎం కోచింగ్ సెంటర్‌లో ఎస్‌క్షి తలారి రామకృష్ణ గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. చెడు వ్యసనాలు అలవాటు చేసుకోకూడదని వివరించారు. అనంతరం టెట్, ఎపిఆర్‌జెసి, పాలిసెట్, గురుకుల ఫలితాలలో టాప్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎవిఎం సంస్థ డైరెక్టర్ అల్లు విష్ణుమూర్తి మాట్లాడారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ టి.రామకృష్ణ

చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం మెజారిటీతో నెగ్గింది. స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించగా మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అధ్యక్షతన చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఇద్దరితో కలిసి 25 మంది వైసిపి కౌన్సిర్లు హాజరయ్యారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ మార్పునకు సంబంధించి చేతులెత్తి ఆమోదం తెలపవలసిందిగా ప్రిసైడింగ్ అధికారి మల్లిబాబు కోరారు. సమావేశంలో పాల్గొన్న 25 మంది సభ్యులు చేతులు ఎత్తి అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించారు. చైర్‌పర్సన్ మార్పునకు తమ అంగీకారం తెలియజేశారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించి అవిశ్వాస తీర్మానం ఆమోదం అయిందని ఆర్‌డిఒ మల్లిబాబు వెల్లడించారు. అవిశ్వాస సమావేశం అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణపై అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టర్‌ను కోరిన సందర్భంలో తనను ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ ఈరోజు ప్రత్యేక సమావేశానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దానిలో భాగంగా నిర్వహించిన సమావేశంలో 25మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాగా కోరం సరిపోయినందున అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్టు చెప్పారు. సమావేశానికి హాజరైన 25 మంది సభ్యులు వారి చేతులెత్తి చైర్ పర్సన్ మార్పునకు అనుకూలంగా 25 మంది సభ్యులు నిర్ణయాన్ని తెలిపారన్నారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నిర్వహించవద్దని హైకోర్టులో పిటిషన్ వేసినందున అది పరిష్కారమైన అనంతరం తదుపరి నిర్ణయాన్ని ప్రకటించనున్నట్టు ఆర్‌డిఒ తెలిపారు. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సిఐ ఎ.కృష్ణ భగవాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



సమావేశానికి హాజరైన వైస్ చైర్మన్, వైసిపి కౌన్సిలర్లు



రాజీనామా పత్రం అందజేస్తున్న అరుణ దంపతులు

చైర్‌పర్సన్ పదవికి అరుణ రాజీనామా

ప్రజాశక్తి - సామర్లకోట

మరో రెండు గంటల్లో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం జరగనుండగా, సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. మున్సిపల్ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్యకు అందజేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ సీటుకు పైభాగంలో ఉన్న దేశ నాయకుల చిత్రపటాలకు ఆమె గౌరవ వందనం చేశారు. అనంతరం నాలుగేళ్ల పాటు తనకు సేవలు అందించిన చైర్‌పర్సన్ కుర్చీకి పూలమాలలు వేసి గౌరవపూర్వకంగా తన రాజీనామాను అందజేశారు. చైర్‌పర్సన్ పదవి రాజీనామా చేయడంతో నాలుగు నెలలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరబడింది. అయితే ఆర్‌డిఒ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారా.. తదుపరి చైర్‌పర్సన్ ఎన్నిక ఎప్పుడు నిర్వహిస్తారనేది స్పష్టత రావాల్సి ఉంది.

శిక్షణ పొందిన కార్మికులకు రాత పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

మెప్మా ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన శిక్షణా శిబిరాలలో శిక్షణ పొందిన కార్మికులకు రాత పరీక్ష అనంతరం సర్టిఫికెట్లు, టూల్ కిట్లు పంపిణీ చేస్తారని డేటా ప్రో మేనేజర్ పి.ఇందు తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో గురువారం ప్రారంభమైన ఎలక్ట్రీషియన్ల రాత పరీక్ష సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మెప్మా ఆధ్వర్యంలో పెద్దాపురం పట్టణ పరిధిలో ఎంపికైన కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లకు శిక్షణ పూర్తి చేశారన్నారు. వీరికి ఆర్‌పిఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి రోహిత్ సైనీ పర్యవేక్షణలో గురువారం నుంచి మూడు రోజులపాటు రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అనంతరం శిక్షణ పొందిన కార్మికులందరికీ సర్టిఫికెట్లు, టూల్ కిట్లు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ పాల్గొన్నారు.

వివాహ సర్టిఫికెట్ లేకుండా రేషన్ కార్డులు

ప్రజాశక్తి- జగ్గంపేట

వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేకుండానే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కావాలని ప్రభుత్వ నిబంధన విధించడంతో అందరూ చాలా ఇబ్బంది గురవుతున్నారన్నారు. ఆ విషయాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, రాష్ట్రంలోని ఎంఎల్‌ఎలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ఆ విధానాన్ని రద్దు చేయించారన్నారు. దీంతో మ్యారేజ్ సర్టిఫికెట్స్ అవసరం లేకుండా రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రేఖబుల్లి రాజు, మండపాక అప్పన్న దొర, కొండ్రోతు శ్రీను, క్లస్టర్ కో కన్వీనర్ కొల్లు రామకష్ణ, దాట్ల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి -రౌతులపూడి

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ అధికారి గోపీనాథ్ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు ఇంటింటికీ పైప్‌లైన్లు అందజేస్తామని తెలిపారు. ఎక్కువ పనులు ఒక్కరికే కేటాయించడం వల్ల పనులు సకాలంలో పూర్తికాలేదని, పనులు పూర్తిచేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రౌతులపూడి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జానకి దేవి, సర్పంచులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలోని గ్రామన్ బ్రిడ్జి సమీపంలో బైకును ఇసుక లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం పట్టణంలోని జగనన్న లేఅవుట్‌లో నివాసం ఉంటున్న దోసనపూడి సుధ తన కుమారుడితో కలిసి బైక్‌పై కొవ్వూరుకు బయలుదేరింది. గామన్ బ్రిడ్జి సమీపానికి చేరే సరికి ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సుధ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు అతన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సిఐ పి.విశ్వం సందర్శించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

60 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కోరుకొండ

సారాను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు, 60 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ముందస్తు సమాచారంతో మండలంలోని గాడాల శివారులో పోలీసులు మోటారు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన కోమటి గోవిందు ద్విచక్రవాహనంపై సారాను తరలిస్తుండగా అరెస్టు చేశారు. అతని నుంచి 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కూన నాగరాజు తెలిపారు. కోమటి గోవిందును కోర్టుకు తరలించగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో 18 నెలల జైలు

ప్రజాశక్తి - కాకినాడ

చెల్లని చెక్కు కేసులో నిందితుడు దూడల శ్రీనివాసరావుకు 18 నెలలు జైలు శిక్ష, బాధితులకు రూ.3.60 కోట్ల పరిహారం చెల్లించాలని కాకినాడ 6వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్.ఉషా లక్ష్మీకుమారి తీర్పు ఇచ్చినట్లు న్యాయవాది ప్రతాప్‌కుమార్ తెలిపారు. పరిహారం చెల్లించని పక్షంలో అదనంగా 4 నెలల 15 రోజులు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారన్నారు. మరొక కేసులో అదే నిందితునికి18 నెలలు జైలు శిక్షతో పాటు బాధితులకు రూ.1.40 కోట్ల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చినట్టు తెలిపారు.

ఉపాధి కూలీకి పాము కాటు

ప్రజాశక్తి - ఐ.పోలవరం

పాము కాటుకు పాధి హామీ పనులు చేస్తున్న మహిళ గురైంది. గురువారం పాతఇంజరం గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న పోటు పాటు కాల్వ వద్ద ఉపాధి కూలీలు పని చేస్తున్న సమయంలో జగడం సరస్వతి అనే కూలీని గుర్తు తెలియని పాము కాటు వేసింది. ఆమె వెంటనే కేకలు వేయడంతో తోటి కూలీలు టి.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు చికిత్స అందించిన అనంతరం ఇంటికి పంపించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని పలు వాహనలు తనిఖీలు చేసి మూడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు సిఐ శ్రీనివాస్ తెలిపారు.గురువారం స్థానిక ఉప్పాడ బస్‌స్టాండ్ వద్ద సిఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో తాగి వాహనం నడుతున్న ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి చాలానాలు విధించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - కాజులూరు

పెనుమళ్ళలో బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలో నుంచి ఇద్దరు యువకులు బంగారు గొలుసును చోరీ చేశారని గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. అంద్రంగికి చెందిన దంపతులు బండారు త్రిమూర్తులు, సూర్యకాంతం కాకినాడకు బైకుపై తెల్లవారుజామున వెళ్తుండగా పెనుమళ్ళ గ్రామ శివారులో ఇద్దరు యువకులు బైకుపై వచ్చి సూర్యకాంతం మెడలో ఉన్న 52 గ్రాముల పుస్తెలతాడు, నల్లపూసలు తెంపుకుని వెళ్లిపోయారురు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

రమణక్కపేట పంచాయతీ శివారులో గురువారం సారా బట్టీలపై దాడులు నిర్వహిం,ఇ 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సారా తయారీకి ఉపయోగించిన బెల్లపు ఊట సామగ్రిని స్వాధీనం చేసుకొని సారా కాస్తున్న అనసూరి శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా కాటన్ 222వ జయంతి

సర్ అర్థన్ కాటన్ 222వ జయంతిని గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కాటన్ విగ్రహానికి డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ వి.సత్యనారాయణ, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్‌కుమార్, ఎండి కాలేషా, ఫిజికల్ డైరెక్టర్ రాంబాబు, ఎ.సుభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పెద్దాపురం కాండ్రకోట పిహెచ్‌సిలో రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత, సుమారు 70 మంది రక్తదానం చేశారు. వైద్యాధికారులు డాక్టర్ బళ్ల చంద్రకిరణ్, డాక్టర్ ఉషా ప్రియదర్శిని, డిఎల్ఒ డాక్టర్ రమేష్, తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, ఎపిఒ సుధీర్, మండల కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, విత్తనాల వెంకటరమణ, మొయిళ్ల కృష్ణమూర్తి, తోట రామకృష్ణ, నూనె రామారావు, రేలంగి వెంకట్రావు, జలదాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాళ్లరేవు కాటన్ జయంతిని ఎపి కౌలు రైతుల సంఘం



గండేపల్లిలో కాటన్‌కు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పటవల, పత్తిగొంది గ్రామాల్లో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిసి చైర్మన్ వేగేశ్న భాస్కర రాజు, చిట్టూరి కలికి మూర్తి, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకష్ణ, ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వల్లు రాజబాబు, మొగలతుర్తి శ్రీనివాసు, దంగేటి సూరిబాబు, నల్లి ఏడుకొండలు, వాసంశెట్టి సత్తిబాబు, గోవాల ఏడుకొండలు, పలివెల ఏడుకొండలు, కాలా సత్తిబాబు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

మే నెల 19 నుంచి 28 వరకు జరగనున్న పదో తరగతి సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలు జిల్లాలో సజావుగా జరిగేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని డిఆర్ఒ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో 10వ తరగతి, ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాలు, పరీక్ష పత్రాల స్టోరేజ్ పాయింట్లు, పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు, ఆర్‌టిసి బస్సుల ఏర్పాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాల్లో 5,956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, డిటిసి లక్ష్మీ కిరణ్, పోస్టల్ పిఆర్‌ఐపి కె.ప్రసాద్ రావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వి.రాజశేఖర్, డిసిఇబి సెక్రటరీ ఎం.వెంకటరావు, ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి పి.సాయి వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా వర్మ పుట్టినరోజు

ప్రజాశక్తి-పిఠాపురం, గొల్లప్రోలు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ పుట్టినరోజు వేడుకలను గురువారం పిఠాపురం రాజు గారి కోటలోని టిడిపి కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వర్మ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని, గొల్లప్రోలు టౌన్ ప్రెసిడెంట్ గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల్లో నాయకులు కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లప్రోలు పట్టణంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎస్‌విఎస్ఎన్ వర్మ పార్టీ కార్యకర్తల మధ్య వికలాంగులతో కలిసికేక్ కట్ చేశారు. బస సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సీరం మాణిక్యం, బచ్చల సౌరి, చేదులూరి సత్యనారాయణ, సీరం బాబీ, పర్వత సురేష్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదానం

ప్రజాశక్తి -పిఠాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తలసేమియా చిన్నారుల కోసం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి ఎ.చైత్రవర్షిణి ప్రారంభించారు. ఈ శిబిరంలో నియోజవర్గ స్థాయి సచివాలయ ఉద్యోగులు, ప్రజలు, రాజకీయ నాయకులు, పాడా డైరెక్టర్ ఎ.చైత్ర వర్షిణి సహా 125 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాతలు రక్తదానం చేయడం ఎంతో శుభ పరిణామం అని అభినందించారు. ఈ మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, తహశీల్దారు గోపాలకృష్ణ, ఎంపిడిఒ చిన్నారావు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కోసం రక్తదానం చేస్తున్న పాడా పీడీ

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

రాజమహేంద్రవరం : నగరంలో పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గురువారం తెల్లవారుజామున దేవీచౌక్ పరిసర ప్రాంతాలలో పారిశుధ్యపనులను ఆయన పరిశీలించారు. రాత్రి సమయాల్లో ప్రమాదాల నుంచి రక్షణ కోసం పారిశుధ్య కార్మికులు రేడియం స్టిక్కర్స్ ఉన్న అప్రాన్‌లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్లపైన వ్యర్థాలు ఉండటానికి వీల్లేదని, చెత్తా చెదారంతో పాటు కాలువల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంలో రూ.2.68 కోట్ల నిధులతో చేపట్టిన పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు గురువారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిల్లి వెంకట లక్ష్మి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఉపసర్పంచ్, గోలి శ్రీరామ్, మాజీ ఎంపిపి కొండపల్లి కృష్ణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కె.శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు, బూడిద శ్రీను, శెట్టి శ్రీను, ప్రత్తిపాటి వీరన్న, వంకా బాబూరావు, పైల వెంకట లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ)జాతీయ కార్యదర్శి డి.బి.లోక్ విమర్శించారు. మండల ంలోని తీర గ్రామాలలో గురువారం ఆర్‌పిఐ కార్యకర్తలతో లోక్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలు అలాగే గ్రామాల్లో విద్యుత్ లో వోల్టేజ్ వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి మాట్లాడారు. అనంతరం లోక్ విలేకరులతో మాట్లాడారు.ప్రజలు ఎదుర్కొం టున్న తాగునీటి సమస్య పరిష్కరిం చడంలోనూ గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య లను పరిష్కరించడం లోనూ పాలకులు విఫలమ య్యారని ఆరోపించారు. ఇది పేదల వ్యతిరేక ప్రభుత్వం అని విమర్శించారు. తీ ర గ్రామాల్లోనూ తాగునీరు, విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలను పరిష్కరించా లన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని అందించి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అలాగే ఉపాధి కూలీల కనీస వేతనాలు పెంచాలన్నారు. సమావేశంలో ఆర్‌పిఐ నాయకులు దోనిపాటి అశోక్ చక్రవర్తి, కొంకి వెంకట బాబ్జి, దోనిపాటి గౌతమ్ కుమార్, పండు రాజేష్, దోనిపాటి కొండ, వెంకటేష్, రాంబాబు పాల్గొన్నారు.

ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

కొండవరం పిహెచ్‌సిలో ఎఎన్ఎం వి.దుర్గాదేవి పని ఒత్తిడి కారణంగా నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు తెలుస్తుంది. ఆమె ప్రస్తుతం పిఠాపురంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం.

పలువురికి గిరిబాబు పరామర్శ

ప్రజాశక్తి-రౌతులపూడి

రాజవరానికి చెందిన వైసిపి నాయకులు సోమరౌతు తిరుమల వెంకన్న దొర తల్లి వెంకయ్యమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు గురువారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వైసిపి యువ నాయకులు పంచడ అశోక్ తండ్రి అప్పలనాయుడు ఇటీవల శస్త్ర చికిత్స చేసుకోవడంతో ఆయనను పరామర్శించారు. ఆయన వెంట వాసిరెడ్డి జమీలు, సూర్రెడ్డి తిరుమల రాయలు, సర్పం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి -కరప

పిహెచ్‌సిలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ నరసింహం నాయక్ సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీ చేసి పలు అంశాలపై సూచనలు, సలహాలు గర్భిణీ స్త్రీలు నమోదు, ప్రసవాల నమోదు, చైల్డ్ రిజిస్ట్రేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సిఎస్ఆర్ నిధులు రూ.46 లక్షలతో ఇటీవల రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రోత్సాహంతో వచ్చిన నూతన పరికరాలను పరిశీలించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఏంజలీనా, డాక్టర్ అప్రోజ్‌తో మాట్లాడారు.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మత్స్యకార మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయపాలెం గోదావరి మహా సమాఖ్యలో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఫిషరీస్ సెక్టార్ ద్వారా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీ పథకాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడి ఫిషరీస్ లావణ్య, ఎఫ్‌డిఒ గోపి, ఎపిఎం విష్ణుమూర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిజిహెచ్‌లో తొలగించిన కాంట్రాక్టు ద్యోగులను హైకోర్టు తీర్పు ప్రకారం వెంటనే విధుల్లోకి తీసుకోవాలనిఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. గురువారం సూపరిండెంట్ డాక్టర్ విఠల్‌కు వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ జిజిహెచ్‌లో ఎఫ్ఎన్ఒ, ఎంఎన్ఒ, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ప్లంబర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి సెక్షన్స్‌లో పని చేసే కాంట్రాక్ట్ సిబ్బంది 2021 వరకు నక్షత్ర ఏజెన్సీ అనే కాంట్రాక్టు సంస్థ ద్వారా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారన్నారు. వీరిని 2021లో అర్ధాంతరంగా తొలగించారన్నారు. హైకోర్టు గురువారం తమను విధుల్లోకి తీసుకోవాలని ఉత్తరవులు జారీ చేసినట్లు తెలిపారు. సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, పిడుగు గంగాధర రావు, దయానంద్, దుర్గ లక్ష్మి, అరుణ, వసంత, గోవిందు, భవాని, రాజు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్ సర్వీసు పునరుద్ధరణ

ప్రజాశక్తి-కాకినాడ

గతంలో యు.కొత్తపల్లి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి వరకూ నేమాం, వాకలపూడి మీదుగా బీచ్ రోడ్డులో నిర్వహించిన ఆర్‌టిసి బస్సు సర్వీసును గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు కలెక్టర్ ఆదేశాలతో పునరుద్ధరించారు. యు. కొత్తపల్లి వాసులు తమ సమస్యను పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి వెంటనే స్పందించి కాకినాడ డిపో ద్వారా బస్సు సర్వీసును తక్షణం పునరుద్ధరించాలని ఆదేశించారు.

ఐవిఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -కరప

అరట్లకట్టలో చెత్త సేకరణ ఐవిఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు తెలిపారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించి అక్కడ కంపోస్ట్ ఎరువులు తయారు చేసి వ్యవసాయ పంటలకు అందించేందుకు సిద్ధం చేయాలని పంచాయతీ అధికారులకు తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులను ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పర్యావరణాన్ని రక్షించాలి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌జీ హీరాలాల్ పాల్గొన్నారు

రాజమహేంద్రి అద్భుత విజయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ టికె.విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కృష్ణ సాయి కళ్యాణ మండపంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 500 మార్కులకు 485 మార్కులు సాధించిన తేతలి కృష్ణతేజశ్రీరెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి 46 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 100 శాతం ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణత సాధించారు.